
# జనం పవర్ జర్నలిస్ట్

MSME No. UDYAM-KM-02-0005137

నిజం వైపు, జనం కోసం

సంపుటి: 01 | సంచిక : 06 | సీఈవో: తుడుం పద్మావతి | ఎడిటర్ : తుడుం జితేందర్ | పేజీలు : 06 | శనివారం | 22-08-2026









## బర్తరఫ్ చేయాలి..

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి..
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!
- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం

2

జనం పవర్ జర్నలిస్టు,డెస్క్

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం.సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు.సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న

- కేంద్రం అనుమతి లేక రేవంత్ రెడ్డి రద్దైన అమెరికా పర్యటన
- నిబంధనలు పాటించలేదని విదేశాంగశాఖ వివరణ
- సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వని విదేశాంగ శాఖ
- లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగిరానున్న సీఎం రేవంత్‌రెడ్డి

# అమెరికా పర్యటన రద్దు



2

జనం పవర్ జర్నలిస్టు,డెస్క్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. సీఎం యూఎస్ పర్యటనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నెల 30 వరకు బ్రిటన్, అమెరికాలో సీఎం పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అనుమతిని కోరింది. లండన్ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో గురువారం అక్కడకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎల్లుండి అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది.అయితే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. రాజకీయ కోణంలో అనుమతి ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చిందని సీఎంవో కార్యాలయం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి అమెరికా పర్యటన రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. లండన్ నుంచి ఎల్లుండి నేరుగా హైదరాబాద్ రానున్నారు. షెడ్యూల్ ప్రకారం అమెరికా వెళ్లి అక్కడి విశ్వవిద్యాలయాలతో ఎంవోయూలు పూర్తి చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

**నా ఆలోచన అదే**

కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను తెలంగాణకు



## ఆఫీసులో అపరిశుభ్రత..

టాయిలెట్లు శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

- నాగర్‌కర్నూల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ
- అధికారుల పనితీరు, ఫైళ్ల జాప్యంపై తీవ్ర ఆగ్రహం
- కార్యాలయంలో అపరిశుభ్రతపై మండిపడిన మంత్రి
- నిరసనగా స్వయంగా టాయిలెట్లు శుభ్రం చేసిన వైనం



## సీఎం వచ్చాక మాట్లాడతా

- క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చానన్న కొండా సురేఖ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడిస్తానని స్పష్టీకరణ
- కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని ఇప్పటికే లేఖలో పేర్కొన్న మంత్రి
- ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం, కాంగ్రెస్ అధిష్ఠానం

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్

- ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయండి: జగదీశ్ రెడ్డి
- ఈ నెల 24న ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్
- తన క్యాంప్ కార్యాలయంలో బంద్ పోస్టర్ ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి
- ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్

2



## పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం: మంత్రి సీతక్క

2



## నా టార్గెట్ రేవంత్ రెడ్డి..

కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత
- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న
- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన
- పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

2



జనం పవర్ జర్నలిస్టు,డెస్క్

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో

దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష 2

జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా డాక్టర్ శ్రీనివాసరావు నియామకం 2

## సెప్టెంబర్ 16న తీర్పు

జనం పవర్ జర్నలిస్టు,డెస్క్

తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్

2




## ఇంకా తేరుకోలేకపోతున్నాను

- ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్
- విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన
- ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య
- పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ
- ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

2



జనం పవర్ జర్నలిస్టు,డెస్క్

పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని,

# ఆఫీసులో అపరిశుభ్రత..

మొదటి పేజీరువాయి

తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలోని టాయిలెట్లను ఆయనే స్వయంగా శుభ్రం చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంత్రి జూపల్లి శుక్రవారం పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. సిబ్బంది నిర్లక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది విస్తుపోయారు.

# బర్తరఫ్ చేయాలి..

మొదటి పేజీరువాయి

వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్చలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

# జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా డాక్టర్ శ్రీనివాసరావు నియామకం

**గతంలో తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గా పని చేసిన గడల శ్రీనివాస్**

**తనకు కీలక పదవిని అప్పగించిన పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాస్**

**పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని వెల్లడి**

జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ నాయకత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ నియామకంపై శ్రీనివాసరావు స్పందిస్తూ... తనపై ప్రత్యేక నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను ఎంతో వినమ్రతతో, నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ప్రజా సమస్యలపై జనసేన వైఖరిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజాసేవే తన ప్రథమ లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు, బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, క్షేత్రస్థాయి ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి.. పార్టీకి–ప్రజలకు మధ్య బలమైన వారధిగా నిలుస్తానని చెప్పారు. ఈ నియామకానికి సహకరించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి, సీనియర్ నాయకత్వానికి, తనకు అండగా నిలుస్తున్న జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



# నా టార్గెట్ రేవంత్ రెడ్డి..

మొదటి పేజీరువాయి

కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

# ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్

మొదటి పేజీరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ–ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ–చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# సెప్టెంబర్ 16న తీర్పు

మొదటి పేజీరువాయి

తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

మొదటి పేజీరువాయి

దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

# అమెరికా పర్యటన రద్దు..

మొదటి పేజీరువాయి

తీసుకొచ్చేందుకే అమెరికా వెళ్లాలని భావించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థల్లో చదువు, శిక్షణ, స్కిల్స్ నేర్చుకోవాలన్న రాష్ట్ర యువత ఆశలు నెరవేర్చాలని తమ ఉద్దేశం అన్నారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్‌సీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో చదివించేందుకు నాయకులు తమ పిల్లలను పంపిస్తారన్న సీఎం, అలాంటి సంస్థల చదువు, సర్టిఫికెట్లు దేశంలోని సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలనేది తన ఆలోచన అని తెలిపారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు కోసం రాజకీయాలకు ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను విశ్వసిస్తానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉస్మానియా, హెచ్‌సీయూ, జేఎన్టీయూ వంటి యూనివర్సిటీలు హైదరాబాద్‌ను ఉత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చాయన్నారు. ఒక్క హైదరాబాద్ పబ్లిక్ స్కూలే ఎంతో మంది టెక్ లీడర్లను తయారు చేసి, మనం ప్రపంచాన్ని లీడ్ చేయగలమని నిరూపించిందని సీఎం ప్రస్తావించారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్ విద్యాసంస్థలు ప్రముఖ కార్పొరేట్ సంస్థలను, వాటి జీసీలను హైదరాబాద్‌కు ఆకర్షించాయన్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అత్యుత్తమ విద్య, నైపుణ్య సంస్థలకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

విదేశీ వ్యవహారాల శాఖ ఏమందంటే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. విదేశీ పర్యటన సీఎం పదవి ఉద్దేశానికి తగినట్లుగా ఉండాలని, అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అంశంలో ఈ నిర్దిష్ట నిబంధనలు పాటించలేదని, అందుకే అనుమతి రాలేదని తెలిపారు.

# ఇంకా తేరుకోలేకపోతున్నాను

మొదటి పేజీరువాయి

క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

మొదటి పేజీరువాయి

హైదరాబాద్, ఆగస్టు21: ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

# సీఎం వచ్చాక మాట్లాడతా

మొదటి పేజీరువాయి

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కార్మికుల సమస్యల పై వినతిపత్రం అందజేత

**ఎమ్మార్వో గారికి ఆటో కార్మికుల సమస్యల పై వినతిపత్రం అందజేసిన చెల్ల విక్రమ్, బి.ఎం.ఎస్ మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు**

**నస్పూర్, జనం పవర్ మంచిర్యాల్ జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ గుడి కందుల రాంబాబు, ఆగస్టు 21 :**

మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ శుక్రవారం రోజున బిఎంఎస్ జాతీయ సంఘాలు అలాగే తెలంగాణ రాష్ట్ర ఆటో యాప్ ఆధారిత జేఏసీ సంఘాల పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రం, మంచిర్యాల కార్పొరేషన్ పరిధి నస్పూర్ జజజ లోని ఎమ్మార్వో సంతోష్ కి ఆటో కార్మికుల సమస్యల పై వినతిపత్రం అందజేసిన చెల్ల విక్రమ్ బీ.ఎం.ఎస్ మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు తధానంతరం ఎమ్మార్వో గారితో మాట్లాడుతూ 23/08/2026 అర్ధరాత్రి 12:00 గంటల నుండి నిరవధిక సమ్మెలో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆటో కార్మికుల హామీలను అమలు పరచాలని . మా న్యాయమైన హక్కులు, ఆటో సంక్షేమ బోర్డుని 1000 కోట్లతో ఏర్పాటు చేయాలి, సంవత్సరానికి 15వేల రూపాయలు ఇవ్వాలి. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు కావొస్తుంది ప్రతి ఆటో డ్రైవర్ 36000 వేల రూపాయలు ఇవ్వాలని, చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఇరవై ఐదు లక్షల ఎక్సరేషియా అలాగే వారి కుటుంబం లో ఒకరికి ఉపాధి కల్పించాలని,ప్రభుత్వం తీసుకొస్తున్న ఈవీ ఆటో లను రద్దు చేయాలి. రాపిడో లాంటి ప్రైవేట్ సంస్థలు కాకుండా ప్రభుత్వమే నూతన యాప్ ద్వారా ఆటోడ్రైవర్లకు ఉపాధి కల్పించాలని,లిమంచిర్యాల జిల్లా ఆటో




ఐకస అన్ని సంఘాల ఆటో నాయకుల ఆధ్వర్యంలో బంధులో పాల్గొంటామని చెప్పడం జరిగిందిలి,ఈ కార్యక్రమంలో బోరె వెంకటేష్ బి.ఎం.ఎస్ మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, పులి రాజేందర్ గౌడ్ నస్పూర్ టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షులు, పాండ్రాల రాజన్న, జైపూర్ మండల్ అధ్యక్షులు, శనిగరపు రాజలింగు,బానోత్ రాజ్, చుంచు వెంకటేష్,సల్లూరి ప్రవీణ్, రవి,మంథయ్యా సంజయ్, పున్నం, మల్లేష్,దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు,



## రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 21,**


ఈ నెల 22వ తేదీన మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టు భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం మంచిర్యాల జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక ను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంచిర్యాల జిల్లాలోని జైపూర్ లో గల ఎస్.టి.పి.పి. అతిథి గృహంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.వీరయ్య తో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి



**జన్నారం జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 21:**

ఇంటి నిర్మాణానికి అనుమతి మంజూరు చేయడానికి లంచం డిమాండ్ చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారుల వలలో చిక్కారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి రూ.13 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.లింగయ్యపల్లి గ్రామానికి చెందిన సందేవేని తిరుపతి నూతన ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించారు. ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు చేయాలంటే రూ.15 వేలు లంచంగా ఇవ్వాలని కార్యదర్శి వరలక్ష్మి డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరకు రూ.13 వేలకు ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.లంచం నగదు రూపంలో తీసుకోకుండా ఫోన్‌పే ద్వారా తన స్నేహితుల ఖాతాకు బదిలీ చేయాలని కార్యదర్శి సూచించినట్లు ఏసీబీ అధికారుల దృష్టికి బాధితుడు తీసుకెళ్లారు. దీంతో ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి లంచం బదిలీ చేసే సమయంలో దాడి చేపట్టారు.కార్యదర్శి సూచించిన విధంగా రూ.13 వేల మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా బదిలీ చేసిన అనంతరం ఏసీబీ అధికారులు వరలక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ చేసిన ఆరోపణలపై ఆమెపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు ఏసీబీ డీఎస్పీ మధు వెల్లడించారు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.





## చింత గింజ మింగి బాలుడు మృతి

**ఆదిలాబాద్: జనం పవర్ జర్నలిస్టు తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి ఆగస్టు 21,**

చింత గింజ మింగడంతో శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందికి గురైన తొమ్మిదేళ్ల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది.పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన మంగేష్ (9) శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు చింత గింజ మింగాడు. దీంతో బాలుడికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడటంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలుడిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మంగేష్ మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కాళేశ్వరం జోన్ క్లస్టర్–సి పోలీస్ క్రీడా పోటీలు

**ప్రారంభించిన సీపీ అంబర్ కిశోర్ ఝా**

**జనం పవర్ జర్నలిస్ట్ వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 21**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని ఆర్‌సీఓ క్లబ్‌లో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026 క్లస్టర్– సి కాళేశ్వరం జోన్ పోలీస్ క్రీడా పోటీలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్,టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ఓపెన్ కేటగిరీతో పాటు 18–30, 40o మరియు 50o వయస్సు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పోలీస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో కాళేశ్వరం జోన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, టీమ్‌వర్క్, పరస్పర





సహకారం,నిరంతర సాధనతో పాటు తమ లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చని అన్నారు.పోలీస్ విధుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమన్వయం,జట్టు స్ఫూర్తి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.క్రీడలు పోలీస్ సిబ్బందిలో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయం,జట్టు భావన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని పరస్పర విశ్వాసంతో సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.క్రీడల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం, అవసరమైన మద్దతు అందిస్తామని సీపీ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ–అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, పెద్దన్న,రమేష్, మల్లేశం,ఆర్ఎస్ఐలు వెంకట్,శివ తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఐదుగురు అరెస్ట్

**జన్నారం జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 20**

జన్నారం: మండల కేంద్రంలోని వినాయక నగర్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి దాడి నిర్వహించారు. ఎస్ నగర్ చర్చి సమీపంలో ఆరుగురు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పోలీసుల కంటపడకుండా పరారైనట్లు ఎస్‌ఐ గుర్రం ఉదయ్‌కిరణ్ గురువారం సాయంత్రం తెలిపారు.పోలీసుల అదుపులోకి తీసుకున్న వారిలో పొనకల్ వినాయక నగర్‌కు చెందిన కుంట రాములు, సేవదాస్ నగర్‌కు చెందిన జాదవ్ నూర్‌సింగ్, జాడి ప్రదీప్‌కుమార్, దుర్గం అనిల్, ఎం.డి. తబ్రేజ్ ఉన్నారు. గాంధీనగర్‌కు చెందిన బోదాసు నర్సింహ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. పేకాట స్థావరం నుంచి రూ.2,360 నగదు, పేకముక్కలు, మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ వివరించారు.

# కేటీఆర్‌పై విరుచుకుపడ్డ ఎంపీ గడ్డం వంశీకృష్ణ


**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి ఆగస్టు 21,**

హైదరాబాద్, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు అంశంలో రాజకీయాలు చేస్తూ వారిని తప్పుదారి పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ, ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణలో గందరగోళం సృష్టించడంలో కేటీఆర్ నంబర్ వన్ అని విమర్శించారు. గతంలో గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినప్పుడు కేటీఆర్ పాత్రపై ప్రశ్నలు తలెత్తాయని ఆరోపించారు. ఈ అంశంలో గతంలో పరస్పర రాజకీయ ఆరోపణలు, విమర్శలు కూడా కొనసాగాయి.విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వారి పక్షాన నిలిచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులతో చర్చించి వారికి భరోసా కల్పిస్తున్నామని, వారి ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని తెలిపారు.

**పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం కట్టుబడి ఉంది**

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజినీరింగ్ చదివే అవకాశాలు కొనసాగుతాయని, వారి ఉన్నత విద్యా ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేసి తెలంగాణ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగుపరిచేందుకు రూ.800 కోట్ల అదనపు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెంచడం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడం, ఉన్నత విద్యలో విద్యార్థులకు మరింత అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణను విద్యా, నైపుణ్య రంగాల్లో ముందంజలో నిలపాలని ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికిన ఎంపీ, విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు. “విద్యార్థుల కోసం మేమున్నాం.. వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇస్తాం” అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.



# వన మహోత్సవంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన

**జన్నారం, జనం పవర్ జర్నలిస్ట్ మామిడిపల్లి నరేష్ ఆగస్టు 21**

జన్నారం మండలంలోని కామన్‌పెల్లి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి హనుమంతరావు, ఫారెస్ట్ బీట్ అధికారి పోచయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ పేరం శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేతతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. చెట్ల సంఖ్య తగ్గడంతో వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి ఆవరణలోనే కాకుండా పొలం గట్లు, చెరువు గట్లపై విరివిగా మొక్కలు నాటాలని



సూచించారు. జానపద గాయకులు లింగంపల్లి రాజకుమార్, మనోజ్‌కుమార్ పాటల రూపంలో మొక్కల ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామస్తుల్లో అవగాహన కల్పించారు. చెట్లు మనిషికి ఆక్సిజన్ అందించడంతో పాటు నేల, నీరు, వాతావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని పాటల ద్వారా వివరించారు. వన మహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం, అడవులను కాపాడటం కూడా మనందరి బాధ్యత అని అటవీ అధికారులు గుర్తుచేశారు. పచ్చదనం పెంపొందించేందుకు గ్రామస్థులు అటవీశాఖకు సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ తరఫున ప్రతి ఇంటికి ఆరు మొక్కలు అందజేశామని తెలిపారు. మొక్కలు నాటడంతో బాధ్యత ముగియదని, వాటికి ప్రతిరోజూ నీరు పోస్తూ సంరక్షించాలని గ్రామస్థులను కోరారు. ప్రతి ఇంటి వద్ద పచ్చదనం పెంచడం ద్వారా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం గ్రామస్తులు "వనం ఉంటే జీవనం", "చెట్లను రక్షిస్తే చెట్లు మనల్ని రక్షిస్తాయి" అంటూ నినాదాలు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. దీంతో అవగాహన సదస్సు ఉత్సాహంగా ముగిసింది.

# ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషిన్

## వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 21,**

మంచిర్యాల జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పంపిణీ పథకము" క్రింద ఆటోమేటిక్ కుట్టు మిషన్ లను 100 శాతం రాయితీతో అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు http://tgobmms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మహిళల వయస్సు 18 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలని, నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరాదరణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులకు, అనాద మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికేట్ ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు. తెల్లరేషన్ కార్డు / ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రము కలిగి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయము గ్రామీణులకు 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ వాసులకు 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. 2023-24 సంవత్సరంలో బి.సి. ఒకేషనల్ స్కీమ్ స్వయం ఉపాధి పథకం క్రింద ఆర్థిక లబ్ది పొందిన వారు అర్హులు కారని, పథకము మంజూరు కొరకు దరఖాస్తుదారులు డౌన్ లోడ్ చేసుకొని సంబంధిత కుల, ఆదాయ, నివాసం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యా అర్హతలు, టైలరింగ్ శిక్షణ / అనుభవం తదితర ధృవీకరణ పత్రాలతో గ్రామీణులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, పట్టణ వాసులు మున్సిపల్ కార్యాలయంలో సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, ఆన్లైన్ చేసిన దరఖాస్తును సంబంధిత అధికారికి సమర్పించనిచో ఆ ధరఖాస్తు పరిగణలోకి తీసుకోబడదని తెలిపారు.



# రూపారెడ్డి హత్యను ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి ఆగస్టు 21,**

- రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ మంచిర్యాలలో ఉపాధ్యాయులు,పాఠశాల యాజమాన్యాల భారీ నిరసన ర్యాలీ
- ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ట్రస్మా

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి దారుణ హత్యకు గురికావడాన్ని నిరసిస్తూ తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) మంచిర్యాల జిల్లా శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలను మూసివేసి, సుమారు 800 మంది ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాల ప్రతినిధులు మంచిర్యాలలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం, కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి శ్రీనివాసరావును కలిసి ట్రస్మా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన రావు విలేకరులతో మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయులపై దాడులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయులు మందలిస్తే, తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి గొడవలకు దిగుతున్నారని తెలిపారు. దీనికితోడు పాఠశాలల పరిసరాల్లో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు పెరుగుతుండటం విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారిందన్నారు.

### ట్రస్మా ప్రధాన డిమాండ్లు:

-ఉపాధ్యాయ రక్షణ చట్టం: ఉపాధ్యాయుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి

-మాదకద్రవ్య రహిత విద్యాసంస్థలు: ప్రతి పాఠశాలను 'మాదకద్రవ్య రహిత ప్రాంతం' (డ్రగ్ ఫ్రీ జోన్)గా ప్రకటించి, పాఠశాలల పరిసరాల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలి.

-అత్యవసర స్పందన వ్యవస్థ: అత్యవసర సమయాల్లో పాఠశాలలు వెంటనే పోలీసులను సంప్రదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

-పోలీసు గస్తీ: పాఠశాల వేళల్లో విద్యాసంస్థల సమీపంలో పోలీసులు క్రమం తప్పకుండా గస్తీ తిరగాలి.

-సామాజిక మాధ్యమాల్లో వేధింపులపై చర్యలు: ఉపాధ్యాయులు, పాఠశాలల ప్రతిష్టకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో




తప్పుడు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-ఉపాధ్యాయులు ఎలాంటి భయం లేకుండా గౌరవప్రదమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తమ విజ్ఞప్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

-అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, ముఖ్యంగా గరళవాటైన సెల్‌ఫోన్ వినియోగం, మద్యపానం, మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీటి నివారణకు ప్రభుత్వం, పోలీసు శాఖ మరియు విద్యాసంస్థలు కలిసి తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

-ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య మాట్లాడుతూ, పాఠశాలల




ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులకు పాల్పడటం విద్యా రంగానికే పెద్ద ముప్పు అని వ్యాఖ్యానించారు. రూపారెడ్డిపై జరిగిన దాడి ఒక్క వ్యక్తిపై జరిగినది కాదని, యావత్ ఉపాధ్యాయ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు భయపడకుండా పనిచేసే సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన రావు, జిల్లా అధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర నాయకులు కస్తూరి పద్మ చరణ్, యార్లగడ్డ బాలాజీ, రాం వేణు, అఖిలేందర్ సింగ్, కె. ప్రవీణ్ కుమార్, గోపతి సత్తయ్యతో పాటు జిల్లా నాయకులు ఉస్మాన్ పాషా, పోలు శ్రీనివాస్, మద్దెర్ల శ్రీనివాస్, పెంచాల శ్రీధర్, మంచిర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సాధిక్ భాష, పట్టణ కోశాధికారి మోహన్ వర్మ, విక్రమ్ రావు, మధు ఖాన్, జాన్ థామస్, బిజ్జు కురివిళ్ళ, జహీరా ఖాతున్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రాజలింగు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి శేషు, మందమరి మండల అధ్యక్షుడు పెద్దపల్లి ఉప్పలయ్య, వై. కరుణాకర్ రెడ్డి, కృష్ణమోహన్ మరియు వివిధ మండలాల పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ

**ఇచ్చోడ, జనం పవర్ జర్నలిస్ట్(ఆగస్టు 20):**

ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి డా. సాధన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణపై సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని సిబ్బంది రికార్డులు, వైద్య సేవలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచకూడదని స్పష్టం చేశారు. మందుల నిల్వ, వినియోగం, పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. మధురిమా, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 15వ తేదీన దిశ సమావేశం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్,జనం పవర్ జర్నలిస్టు,మంచిర్యాల జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ గుడిగందుల రాంబాబు, ఆగస్టు 20:**

మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సెప్టెంబర్ 15వ తేదీ ఉదయం 10:30 గంటలకు దిశ త్రైమాసిక సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా శాఖల అధికారులు తమ శాఖల పురోగతి నివేదికలను హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీ రూపంలో ఈ నెల 31 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

# షావుకారు జానకి కన్నుమూత.. పవన్ కల్యాణ్ సంతాపం

ప్రముఖ సినీ నటి షావుకారి జానకి మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక సంతాప సందేశాన్ని విడుదల చేశారు. షావుకారి జానకి సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలను పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తొలి సినిమా పేరునే తన ఇంటిపేరుగా మార్చుకున్న ఆమె, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లో నటించి మెప్పించారని కొనియాడారు. కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో విభిన్న పాత్రలు పోషించి ఆమె ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. షావుకారి జానకి కుటుంబ సభ్యులకు తన తరఫున, జనసేన శ్రేణుల తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొన్నారు.

# మయన్మార్ బౌద్ధ ఆశ్రమంపై వైమానిక దాడి.. 14 మంది మృతి!

మయన్మార్‌లో మరో ఘోరం చోటుచేసుకుంది. సెంట్రల్ సగయింగ్ ప్రాంతంలోని ఒక బౌద్ధ ఆశ్రమంపై సైనిక ప్రభుత్వం జరిపిన వైమానిక దాడిలో 14 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆశ్రమంలో ధ్యాన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఈ దాడి జరగడం పెను విషాదాన్ని నింపింది. మ్యోంగ్ టౌన్‌షిప్‌లోని స్వెల్ లే ఓ గ్రామంలో ఉన్న బౌద్ధ ఆశ్రమంలో వారం రోజుల పాటు ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రజలంతా ధ్యానంలో నిమగ్నమై ఉండగా, సైనిక యుద్ధ విమానం ఆశ్రమ ప్రాంగణంలో బాంబు దాడికి పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో సహా 14 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 మందికి పైగా గాయపడ్డారని మ్యోంగ్ టౌన్‌షిప్ సివిల్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ప్రతినిధి వెల్లడించారు. మాండలే నగరానికి పశ్చిమాన సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం, ప్రజాస్వామ్య అనుకూల శక్తులు, స్థానిక సాయుధ వర్గాల మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సగయింగ్ ప్రాంతంలో ఇరు పక్షాల మధ్య పోరు తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సైన్యం జరుపుతున్న వైమానిక దాడుల వల్ల సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.








## నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**మంచిర్యాల, జనం పవర్ జర్నలిస్ట్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ వేల్పుల నాగేష్ ఆగస్టు 20 :**

మంచిర్యాల జిల్లా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యంతో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తీగల్పహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ ప్రారంభించారు. కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డితో కలిసి మేయర్ రిబ్బన్ కట్ చేసి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ దర్ని మధుకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ విద్య ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని అన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని అనేక అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులకు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు డిజిటల్ విద్యపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మేయర్ సూచించారు. విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలను నేర్చుకోవాలని, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మేయర్ దర్ని మధుకర్, కార్పొరేటర్ తాళ్ల సంపత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మొక్కల ప్రాధాన్యతను తెలుసుకుని వాటిని సంరక్షించే అలవాటు పెంచుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని కోరారు. కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభంతో పాఠశాల విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతు బలోపేతం — దేశ బలం

రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన

కనీస మద్దతు ధరలు (MSP)

★ 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు వర్తింపు ★

| | పంట | 2025-26 MSP (₹/క్వింటాల్) | 2026-27 MSP (₹/క్వింటాల్) | పెరుగుదల (₹/క్వింటాల్) |
|---|---|---|---|---|
| 1. | 1. వరి (సాధారణం) | ₹2369 | ₹2441 | ▲ ₹72 |
| 2. | 2. వరి (గ్రేడ్ A) | ₹2389 | ₹2461 | ▲ ₹72 |
| 3. | 3. జొన్న (హైబ్రిడ్) | ₹3699 | ₹4023 | ▲ ₹324 |
| 4. | 4. జొన్న (మల్దాండి) | ₹3749 | ₹4073 | ▲ ₹324 |
| 5. | 5. బాజ్రా | ₹2775 | ₹2900 | ▲ ₹125 |
| 6. | 6. మొక్కజొన్న | ₹2400 | ₹2410 | ▲ ₹10 |
| 7. | 7. రాగి | ₹4886 | ₹5205 | ▲ ₹319 |
| 8. | 8. తూర్ / కందులు | ₹8000 | ₹8450 | ▲ ₹450 |
| 9. | 9. పెసర్లు | ₹8768 | ₹8780 | ▲ ₹12 |
| 19. | 10. మినుములు | ₹7800 | ₹8200 | ▲ ₹400 |
| 11. | 11. వేరుశెనగ | ₹7263 | ₹7517 | ▲ ₹254 |
| 12. | 12. సోయాబిన్ | ₹5328 | ₹5708 | ▲ ₹380 |
| 13. | 13. సూర్యకాంతి | ₹7721 | ₹8343 | ▲ ₹622 |
| 14. | 14. నువ్వులు | ₹9846 | ₹10346 | ▲ ₹500 |
| 15. | పత్తి (మిడియం స్టేపుల్) | ₹7710 | ₹8267 | ▲ ₹557 |
| 16. | పత్తి (లాంగ్ స్టేపుల్) | ₹8110 | ₹8667 | ▲ ₹557 |
| 17. | నైజర్ విత్తనాలు | ₹9537 | ₹10052 | ▲ ₹515 |

అత్యధిక MSP పెరుగుదల పొందిన పంటలు
1. సూర్యకాంతి ▲ ₹622
2. పత్తి (మీడియం & లాంగ్ స్టేపుల్) ▲ ₹557
3. నైజర్ విత్తనాలు ▲ ₹515
4. నువ్వులు ▲ ₹500

గమనిక: పై ధరలు ₹/క్వింటాల్ లో ఇవ్వబడ్డాయి.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ శాహబుద్దీన్

**మంచిర్యాల,జనం పవర్ జర్నలిస్టు,మంచిర్యాల జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ గుడికందుల రాంబాబు, ఆగస్టు 20 :**

మంచిర్యాల జిల్లా,రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఈ క్రమంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కనీస మద్దతు ధరలు నిర్ణయించడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ శాహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం 2026-27 సీజన్ లో రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

# జన గణన ప్రతుల దహనం

### ఓబీసీ కాలాన్ని చేర్చాలని బీసీ సంఘాల డిమాండ్

**మంచిర్యాల జనం పవర్ జర్నలిస్టు, మంచిర్యాల జిల్లా,స్టాఫ్ రిపోర్టర్ గుడికందుల రాంబాబు, ఆగస్టు 20:**





మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా లో కేంద్ర ప్రభుత్వం జన గణన ప్రతులల్లో ఓబీసీ కాలాన్ని చేర్చకపోవడాన్ని నిరసిస్తూ.. జన గణన ప్రతులను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జన గణనలో భాగంగా బీసీ కులగణన చెప్పడతామని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ ఆ మాటను విస్మరించి బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. 2025ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చెప్పడతామని ప్రధాని ప్రకటించారు. కుటుంబాల తొలి దశ లెక్కింపులో ఓబీసీ కుటుంబాలను చేర్చాలన్న డిమాండ్ ను పట్టించుకోలేదని అన్నారు. 2వ దశలో కులగణన చెప్పడతామని హామీ ఇచ్చారు. కులగనన చేపడితే ప్రస్తుతమున్న రిజర్వేషన్ లు పెంచాల్సి వస్తుందన్న ఉద్దేశంతో, అలాగే చట్ట సభల్లో రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్ ముందుకు వస్తుందనే ఉద్దేశంతో బీసీల లెక్కింపులో ఓబీసీలపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీల ఉద్యమ ఆకాంక్షను గుర్తించాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచే విదంగా బీసీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కులగణన ప్రతులను దహనం చేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు, ప్రజావాణి సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ వర్మ, తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మంచర్ల సదానందం, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా మహమ్మద్ లతీఫ్, న్యాయవాది సురేందర్ చారి, బీసీ నాయకులు చంద్రగిరి చంద్రమౌళి, పెద్దల చంద్రకాంత్ ,అంకం సతీష్ ,పడాల శివతేజ, ఆరందుల రాజేశం, బూర రవీందర్, బొంగోని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి ఇంద్రవెల్లి యువత

### రాజీవ్ గాంధీ జయంతి వేళ కాంగ్రెస్‌లోకి ఇంద్రవెల్లి యువత

**ఉట్నూర్ జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 20:**




మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఇంద్రవెల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి యువత పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. ఇంద్రవెల్లి మండలానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ జయంతి రోజున పెద్ద సంఖ్యలో యువత కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషకరమైన విషయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఇంద్రవెల్లి మండల కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే యువతను పార్టీ గుర్తించి భవిష్యత్‌లో తగిన అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు యువత ముందుండాలని సూచించారు. ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు ఎండీ జహీర్, పట్టణ అధ్యక్షులు జితేందర్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తమ్ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాంబ్లె బాబారావు, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు. యువకులు తుంగపిండి ఉదయ్ రాజ్ (టిల్లు), లింగంపల్లి సాయి తేజ, గజ్జెల రాజు, సంతోష్, కార్తీక్, ప్రసాద్‌తో పాటు పలువురు యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నూతనంగా చేరిన యువతకు అభినందనలు తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని సూచించారు.

# ఎల్కంటిలో సింగరేణి–ఎస్టీపీపీ సేవా కార్యక్రమం

### 72 మందికి ఉచిత వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ

**జనం పవర్ జర్నలిస్ట్, జైపూర్, చెన్నూర్ ఆర్సీ, రేగుంట వెంకటేష్, ఆగస్టు 20**



మంచిర్యాల జిల్లా జైపూర్ మండల్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం మరో అడుగు ముందుకేసింది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఎల్కంటి గ్రామంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఈడీ శ్రీ సీహెచ్ చిరంజీవి తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా వ్యాధులను ముందస్తుగా గుర్తించి, అవసరమైన నివారణ చర్యలు చేపట్టేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

#### ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈడీ చిరంజీవి పిలుపునిచ్చారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా, ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు.

#### 72 మందికి వైద్య పరీక్షలు

డా. కె. పవన్ మాట్లాడుతూ.. వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. సుమారు 72 మంది శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారని, పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు, ప్లాంట్ ప్రభావిత ప్రాంతాల్లో ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సింగరేణి–ఎస్టీపీపీ చేపడుతున్న ఈ కార్యక్రమంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### అధికారులకు అదనపు కలెక్టర్ వి.రాములు ఆదేశం

**మంచిర్యాల జిల్లా జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 20**



మంచిర్యాల: జిల్లాలో భూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను రికార్డుల ఆధారంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ వి.రాములు లక్షెట్టిపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ భూ సంబంధిత అంశాలపై చేపట్టిన విచారణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం హాజీపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్.. భూ భారతి, సాదా బైనామాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, రికార్డులను పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువు దాటకుండా ప్రతి దరఖాస్తును పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనామలీస్ అంశంపైనా అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. గుర్తించిన అనామలీస్‌కు నోటీసులు జారీ చేయడంతో పాటు తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకత, నిబంధనల పాటింపు తప్పనిసరిగా ఉండాలని వి.రాములు పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

